క్లుప్తంగా

అబ్బయ్య చౌదరిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



కొఠారు అబ్బయ్య చౌదరిని కలిసిన నేతలు

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సోమవారం ఆయన కార్యాలయంలో నియోజవర్గం నుంచి పార్టీ నాయకులు కలిశారు. గ్రామాల్లో పరిస్థితులను వివరించారు. అధైర్య పడవద్దని బాధితులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులకు భరోసానిచ్చి తనతో పాటు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఏలూరు రూరల్ మండల కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు, పరశురాం, వివిధ గ్రామాల నాయకులు మాజీ ఎమ్మెల్యే అబ్బాయి చౌదరిని కలిశారు.

వెంకటేష్‌కు నివాళులర్పించిన అబ్బయ్యచౌదరి

పెదవేగి : ఇటీవల ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మరణించిన వెంకటేష్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెదవేగి మండలం జగన్నాథపురం సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు సోదరుడి కుమారుడు మాత్రపు వెంకటేష్ విద్యుదాఘాతానికి గురై మరణించిన విషయం విదితమే.

వైఎస్సార్‌సీపీ నేత అబ్బులుకు పరామర్శ



అబ్బులును పరామర్శిస్తున్న పుప్పాల వాసుబాబు, పార్టీ నేతలు

గణపవరం: వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మారిశెట్టి వేణుగోపాల కృష్ణమూర్తి (అబ్బులు) సతీమణి రత్నకుమారి అకాల మరణం తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ముగ్గుళ్ల గ్రామంలో మారిశెట్టి అబ్బులును పరామర్శించారు. రత్నకుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దండు రాము, గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రసాద్, పార్టీ నేతలు దేవారపు బాబులు, పాలంశెట్టి శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానం



రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలో మూడో స్థానంలో నిలిచిన గణపవరం విద్యార్థులు

గణపవరం: వైఎస్సార్ జిల్లా పులివెందులలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో గణపవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచూపి మూడోస్థానంలో నిలిచారని పీడీ పద్మావతి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి అండర్ 17 బాలికల విభాగంలో ఈ విజయం వరించింది. విజేతలైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ పద్మావతిని హెచ్ఎం మూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ నిర్మలకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ సమాజ స్థాపన లక్ష్యంగా మానవత కృషి



దీర్ఘకాలిక రోగి లక్ష్మికి ఆర్థిక సాయం, బియ్యం అందజేస్తున్న గుల్ల నూకరాజు తదితరులు

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపన లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని ఆ సంస్థ మండల చైర్మన్ గుల్ల నూకరాజు అన్నారు. మండల మానవత మండల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమడోలు, ఆర్జావారిగూడెంలోని దీర్ఘకాలిక రోగి, నిరుపేద కుటుంబాల వారికి సోమవారం నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. భీమడోలులోని జమ్ము లక్ష్మి దీర్ఘకాలిక రోగంతో బాధపడుతుండగా ఆమెకు రూ.5వేల ఆర్థిక సాయం, పిన్నింటి అప్పారావు 25 కేజీల బియ్యంను అందజేశారు. ఆర్జావారిగూడెంలోకు చెందిన నిరుపేద కుటుంబానికి బియ్యం, నిత్యవసరకులు, నూతన వస్త్రాలను అందించారు. దాతల స్పందించిన ఆ కుటుంబాలను ఆదుకోవాలని ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఉన్నమట్ల సత్యనారాయణ, ప్రతినిధులు గుల్ల అప్పారావు, ధనలక్ష్మీ, చిలపర్తి ఆదినారాయణ, గేదెల అప్పన్న పాల్గొన్నారు.

కోరలు చాస్తున్న కాలుష్యం

- కాలంచెల్లిన వాహనాలు, కల్తీ ఇంధనాలు ప్రధాన కారణం
- 15 ఏళ్లు దాటిన భారీ వాహనాలు, కార్లు, బైక్‌లతోనే అసలు సమస్య
- వాతావరణంలోకి విడుదలవుతున్న విషపూరిత ఉద్గారాలు
- వాయు, ధ్వని కాలుష్యంతో రోగాలబారిన ప్రజలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వాహనాల నుంచి వెలువడుతున్న పొగ

పెదవేగి : దెందులూరు నియోజకవర్గంలో వాతావరణ కాలుష్యం నానాటికీ పెరిగిపోతోంది. నగరాలు, పట్టణాలకే పరిమితమైన కాలుష్య భూతం గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది. కాలం చెల్లిన వాహనాలు వెదజల్లే కాలుష్యానికి తోడు నకిలీ లూబ్రికెంట్లు, కల్తీ పెట్రోలు, డీజిల్ కారణంగా దట్టమైన పొగ వస్తూ వాహనచోదకులు, పాదచారులకు అసౌకర్యం కలిగిస్తోంది. వాహనాలకు కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని రవాణా శాఖ నిర్దేశించినా తనిఖీల్లో మాత్రం ఈ విషయాన్ని విస్మరిస్తున్నారు. వాహన కాలుష్య తనిఖీ యంత్రాంగం మొక్కుబడితంతుగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాల సామర్థ్యం పరిశీలించి రోడ్డుపై తిరిగే అవకాశం ఉంటే గ్రీన్ ట్యాక్సు కట్టించుకుని అనుమతి ఇవ్వాల్సి ఉండగా ఈ నిబంధనలను ఎవరూ పాటించడం లేదు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే బస్సులు సైతం దట్టమైన పొగ వెదజల్లుతూ రోడ్లపై తిరుగుతుండటంతో జనం ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ప్రైవేటు విద్యాసంస్థలు నడిపే వ్యాన్లు, బస్సులు కూడా కాలం చెల్లిన తర్వాత రోడ్లపై తిరుగుతూ కాలుష్యం వెదజల్లుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి.

అన్నింటా కాలుష్యమే

నియోజకవర్గంలోని పెదవేగి, దెందులూరు, అలుగులగూడెం, కూచింపూడి, వంగూరు లక్ష్మీపురం, బోగాపురం, పెదపాడు, వట్లూరు తదితర ప్రాంతాల్లో అనధికారికంగా హోటళ్లు, హాస్టళ్ల నిర్వహిస్తూ వాడకపు నీరు రోడ్లపైకి వదిలేస్తుండటంతో రక్షిత మంచినీటి పైపులైన్లలో చేరి తాగు నీరు కలుషితమవుతోంది. మాంస వ్యర్థాలు, చెత్తా చెదారం జనావాసాల నడుమ పడేస్తుండటం, వాటిని నిత్యం తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతూ కుళ్లిన చెత్త నుంచి వచ్చే మిథేన్ వాయువు కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. బహిరంగ ధూమపానం నిషేధించిన బస్టాండ్లు, సినిమాహాళ్లు, టీ స్టాల్స్, రోడ్లపై ధూమపాన ప్రియులు సిగరెట్లు తాగుతూ పరోక్షంగా వాయు కాలుష్యానికి కారణమవుతున్నారు.

ధ్వని కాలుష్యంతో గుండె, వినికిడి సంబంధిత వ్యాధులు

వాతావరణ కాలుష్యంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. డీజే మైకుల హోరుతో గుండె, వినికిడి సంబంధిత వ్యాధులు వస్తున్నందున వాటిని నిషేధించాలని కోరుతున్నా పోలీసు అధికారులు స్పందించడం లేదని సామాజిక కార్యకర్తలు వాపోతున్నారు. పండుగలు, పర్వదినాల్లో ఊరేగింపులు జరిగేటప్పుడు డీజే సౌండ్ సిస్టమ్ వినియోగిస్తూ పరిమితికి మించిన శబ్దాలతో ధ్వని కాలుష్యానికి కారకులమవుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి



వాతావరణ కాలుష్యానికి కారణమయ్యే వాహనాలను నియంత్రించాలి. రవాణా శాఖాధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి అనంతరం వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలి.ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా, అవినీతిరహితంగా జరగాలి.

– ఆళ్ల చంద్రశేఖరరెడ్డి, విజయరాయి గ్రామనాయకులు

అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి



కాలం చెల్లిన బస్సులు నడుపుతున్నప్పటికీ తనిఖీ చేయక పోవడంతో వాతావరణంలో కాలుష్యం పెరిగిపోతోంది. రవాణా శాఖ ఇకనైనా స్పందించి ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం వాతావరణ కాలుష్యంపై స్పందించకుంటే భావితరాలకు తీరని నష్టం వాటిల్లుతుంది.

– పొన్నూరి శంకర్‌గౌడ్, సామాజిక కార్యకర్త

జాతీయ చిత్రకళ పోటీల్లో అప్పనవీడు విద్యార్థులు



జాతీయ చిత్రకళ పోటీ విజేతలతో అప్పనవీడు జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు

పెదపాడు: ఇటీవల ఒంగోలులో సృష్టి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిల్డ్రన్ యూత్, పెయింటింగ్స్ పోటీలో పాల్గొని అప్పనవీడు విద్యార్థులు 9 మంది బంగారు పతకాలు సాధించారు. 75 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్స్ పొందారు. డ్రాయింగ్ మాస్టరు రజనీకాంత్ చిత్రకళ విపంచి అవార్డును అందుకున్నారు. వీరిని ప్రధానోపాధ్యాయురాలు పుష్పావతి పేరెంట్స్ కమిటీ చైర్మన్ మోగంటి లక్ష్మీ దుర్గ, మండల విద్యాశాఖాధికారులు సచ్చితి నర్సింహమూర్తి, డీవీ రమణ అభినందించారు.

ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

దెందులూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేయటంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 6వ తేదీతో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సబంధించి ఓటు నమోదుకు గడువు ముగుస్తున్నందున పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ



గుండుగొలను శివాలయంలో లక్ష రుద్రాక్షల అలంకరణలో భ్రమరాంబికా మల్లేశ్వరుడు



భక్తులతో కిటకిటలాడిన భీమేశ్వరస్వామి ఆలయం

భీమడోలు: శివునికి ప్రీతిపాత్రమైన సోమవారం శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. మండలంలో శివాలయాల్లో ఉదయం, రాత్రి వేళల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. ఆలయాలు విద్యుత్ కాంతులతో ధగధగలాడాయి. భీమడోలులోని శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయం, పోలసానిపల్లిలోని రామలింగేశ్వర స్వామి, గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి, అంబర్‌పేటలోని ఉమారామలింగేశ్వర స్వామి, పూళ్లలోని సకలేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు గోదావరి స్నానాలచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలసానిపల్లి శివాలయంలో స్వామివారికి క్షీరాభిషేకాలు, వివిధ రకాల పూజలు చేశారు.

శివునికి లక్ష రుద్రాక్షలతో ఆలంకరణ

గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర ఆలయంలో స్వామి వారికి లక్ష రుద్రాక్షలతో పూజలు వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చి శివ పంచాక్షరి మంత్రం జపిస్తూ పూజారి లంకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామూహిక లక్ష రుద్రాక్షల పూజలో పాల్గొన్నారు.



భీమడోలులో భక్తుల పూజలందుకుంటున్న పార్వతీ సమేత భీమేశ్వర స్వామి

సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

అపరిశుభ్రంగా శ్మశానవాటిక రోడ్డు



చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్న శ్మశానవాటిక రహదారి

గణపవరం: మేజర్ పంచాయతీ గణపవరంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. రోడ్డుపక్కన వేస్తున్న చెత్తాచెదారం, కొబ్బరి బొండాలు, అరటి గెలలు, చెత్తను పందులు రోడ్డుమీదికి లాగివేస్తున్నాయి. దీనితో ఆరోడ్డుపై నడవాలంటేనే ఇబ్బందికరంగా ఉంటోంది. ఈరోడ్డు మీదుగా శ్మశానానికి వెళ్లే వారితోపాటు పలువురు రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇదే ప్రాంతంలో విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం ఉంది. ఈ అపరిశుభ్రత, దుర్వాసన నడుమ విద్యుత్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈరోడ్డుకు ఇరువైపులా ప్రముఖ సామాజిక వేత్త, అల్లూరి రంగరాజు వివిధ రకాల చెట్లను నాటి కొన్నాళ్లపాటు పోషించారు. స్థానికులు, వ్యాపారులు చెత్తాచెదారాన్ని ఈరోడ్డు పక్కనే పారబోయడంతో ఆ మొక్కలు చనిపోయాయని రంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఈ రోడ్డును బాగు చేయించాలని ఆయన కోరారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంతకాల సేకరణ



ఫ్లై ఓవర్ నిర్మాణానికి మద్దతుగా సంతకం చేస్తున్న సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్

దెందులూరు: దెందులూరు రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని చేపట్టాలని మూడు మండలాల్లో సర్పంచులు తీర్మానం చేశారని ఫ్లై ఓవర్ బ్రిడ్జి సాధన కమిటీ చైర్మన్ మద్ద భూషణం అన్నారు. సోమవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా దెందులూరు ద్వారకాతిరుమల మండలాల్లో గ్రామ సర్పంచులను, ఎంపీటీసీలను కలిసి ఫ్లై ఓవర్ నిర్మాణం ఆవశ్యకత, ప్రయాణికులకు కలిగే వెసులుబాటు, ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధికి వచ్చే భక్తులకు సమయం, డబ్బు ఆదా తదితర అంశాలను వివరించామన్నారు. బ్రిడ్జిని నిర్మించాలని 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దెందులూరు మండలంలో సర్పంచులు పంచాయతీ తీర్మానాలను ఇచ్చారన్నారు. ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఎన్‌జీవోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు మద్దతుగా సంతకాలు చేశారన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశామన్నారు. త్వరలోనే కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులను కలిసి దెందులూరు రైల్వే గేట్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం మంజూరుకు వినతిపత్రం అందజేస్తామని మద్ద భూషణం అన్నారు.

విద్యార్థి దశ నుంచి చట్టాలను తెలుసుకోవాలి



భీమడోలులో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం నూతనంగా అమలు చేసిన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హెచ్ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు పోలీసులు, విద్యార్థులు కలిసి సేఫ్ ఇండియా పేరిట సోమవారం వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులంతా ప్లకార్డులను చేతపట్టుకుని పురవీధుల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. శిరస్త్రాణం వల్ల కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇ.సోహని, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, డీన్ భార్గవ్, ఏవో ముఖేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెదపాడు: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జిల్లా కార్యదర్శిగా జితేంద్ర

గణపవరం: అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏబీవీపీ ఏలూరు జిల్లా కార్యదర్శిగా గణపవరానికి చెందిన కోడూరి జితేంద్రనాథ్ నియమితులయ్యారు. సోమవారం భీమవరంలో నిర్వహించిన విభాగ్ అభ్యాస్ వర్గ్ సమావేశంలో ఈమేరకు నియామకపత్రాన్ని అందించారు. తనను ఏలూరు జిల్లా కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మురళీధరరావు, కార్యదర్శి యాచేంద్ర, విభాగ్ ప్రముఖ్ అంజనీ శ్రీనివాస్, భీమవరం కార్యదర్శి చందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈయన నియామకం పట్ల బీజేపీ సీనియర్ నాయకులు కోడూరి సుబ్బరాజు, నంద్యాల రామలింగరాజు అభినందనలు తెలిపారు.

మద్యం సీసాలు పట్టివేత

పెదవేగి : అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి మద్యం సీసాలు సీజ్ చేశారు. పెదవేగి మండలం కొప్పులవారి గూడెంలో సోమవారం ఎక్సైజ్ శాఖ ప్రత్యేక బృందం దాడులు నిర్వహించి, మునుసూరి నరేష్ వద్ద నుంచి 875 లిక్కర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. వేగివాడలోని వైన్ షాపు నుంచి మద్య బాటిల్లు కొనుగోలు చేసి బెల్ట్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి దాడి చేసినట్టు ఎక్సైజ్ శాఖ అధికారులు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

45 మద్యం బాటిళ్ల స్వాధీనం

పెదపాడు: అక్రమంగా నిల్వ ఉంచిన 45 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ అధికారులు సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడులో ముందస్తు సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నాగ సత్య ఈశ్వరరావు వద్ద 45 బాటిళ్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

తల్లాపురం మాజీ సర్పంచి రామకృష్ణ మృతి



రామకృష్ణ పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డు గ్రహీత, వైఎస్సార్‌సీపీ నాయకుడు, తల్లాపురం మాజీ సర్పంచి పైడిముక్కల రామకృష్ణ ఆదివారం రాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. ఆయన పార్థివ దేహాన్ని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సందర్శించి నివాళులర్పించారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మరడ మంగరావు, యెలిశెట్టి పాపారావుబాబ్జి, పుప్పాల గోపి, అడపా శ్రీను, బళ్ల త్రిమూర్తులు, సంగాభత్తుల పాండు తదితరులు రామకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. 2006 నుంచి 2011 వరకు, 2014 నుంచి 2018 వరకు రెండు పర్యాయములు తల్లాపురం సర్పంచిగా రామకృష్ణ పనిచేసి ప్రజల మన్నలను అందుకున్నారు. 2007లో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో నూరు శాతం ఫలితాలు సాధించడంతో ఆనాటి రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ చేతుల మీదుగా నిర్మల్ పురస్కార్ అవార్డును ఢిల్లీలో రామకృష్ణ అందుకున్నారు. అదే సందర్భంలో హైదరాబాదులో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చేతుల మీదుగా సత్కారం పొందారు. రామకృష్ణ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన నాయకుడిగా పని చేసి గుర్తింపు పొందారు. రామకృష్ణ మృతితో తల్లాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జాతీయ పోటీలకు భీమడోలు విద్యార్థి ఎంపిక



భీమడోలులో విద్యార్థి సాయిరామ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ బొమ్మ రవికుమార్, అధ్యాపకులు

భీమడోలు: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అంతర యూనివర్సిటీ 10 కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగు పందెంలో భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల బీఏ ప్రథమ సంవత్సర విద్యార్థి పి.సాయిరామ్ తృతీయ స్థానాన్ని సాధించి సత్తా చాటాడు. జాతీయస్థాయి అంతర యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు మంగళూరు ఆల్వాస్ కళాశాలలో నిర్వహించనున్న జాతీయస్థాయి అంతర యూనివర్సిటీ పోటీలకు సాయిరామ్ హాజరు కానున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సాయిరామ్‌ను ప్రిన్సిపల్ బి.రవికుమార్, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ కె.శివశంకర్, పీడీ సురేష్, అధ్యాపకులు శ్రీనివాస్ అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

దెందులూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇచ్చిన ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించి సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి తహసీల్దార్ బి.సుమతి వినతులు స్వీకరించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి గారపాటి కొండయ్య చౌదరి పాల్గొన్నారు.